సాక్షి
కుమురం భీం
బుధవారం ; 22 ; ఫిబ్రవరి ; 2023



లాభాలు 'పట్టు'

దసలి పట్టుపురుగులతో గిరిజన రైతులకు జీవనోపాధి లభిస్తోంది. 20 ఏళ్లలో ఏనాడు లేనివిధంగా ఈసారి రికార్డు స్థాయిలో లాభాలు ఆర్జించారు. 8లో▸



పట్టు సాధిస్తే 'పది'లం

నేటి నుంచి పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పాఠ్యాంశాలపై పట్టు సాధిస్తేనే మార్కులు సాధించవచ్చని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
36.4 /17.6

వాతావరణం

మధ్యాహ్నం ఎండతీవ్రత అధికంగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. చలి ప్రభావం చాలావరకు తగ్గుతుంది. తెల్లవారుజామున కాస్త చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్



జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్: నూతనంగా జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన బోర్కడే హేమంత్ సహదేవ్‌రావు మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్రశర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని కోర్టులో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు అంశాలపై చర్చించారు.

ప్రశాంతంగా కొనసాగుతున్న ప్రయోగ పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఇంటర్మీడియెట్ ప్రయోగ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని డీఐఈవో శ్రీధర్ సుమన్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పరీక్ష కేంద్రాలను మంగళవారం డీఈసీ బృందం సభ్యులతో కలిసి పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా ఉదయం నిర్వహించిన ప్రాక్టికల్స్‌కు 449 మంది విద్యార్థులకు గాను 399 మంది హాజరు కాగా 50 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 382 మందికి గాను 362 మంది హాజరు కాగా 20 మంది గైర్హాజరయ్యారని డీఐఈవో తెలిపారు.

సమీకృత కలెక్టరేట్ పనులు పూర్తి చేయాలి



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, తదితరులు

ఆసిఫాబాద్‌అర్బన్: సమీకృత కలెక్టరేట్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్మాణంలో ఉన్న సమీకృత కలెక్టరేట్ భవనాన్ని మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. భూమి చదును పనులను సక్రమంగా నిర్వహించాలన్నారు. భవనం ఆవరణలో మొక్కలు నాటి, వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతర్గత రహదారులు, బోర్‌వెల్ ఇతర పనులు గడువులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట పర్యాటక, ఉద్యానవన, రోడ్డు భవనాల శాఖ అధికారులు ఉన్నారు.

'మాతృభాష గొప్పతనం మాటల్లో చెప్పలేం'



పుస్తకాలు అందజేస్తున్న భౌమిక్ పరిమళ్

ఆసిఫాబాద్‌అర్బన్: మాతృ భాష గొప్పతనం, తియ్యదనాన్ని మాటల్లో చెప్పలేమని జిల్లా కేంద్ర సంచాలకులు, అష్టావధాని మాడుగుల నారాయణమూర్తి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో మంగళవారం చిమ్మపుడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నారాయణమూర్తి అధ్యక్షతన మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోండు, కొలాం, అంద్, గోర్మాటీ, మరాఠి, తెలుగు మాట్లాడే విద్యార్థులకు మాతృభాష గొప్పతనాన్ని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నీతి శతకాలు, ఉపాధ్యాయులకు బాలల భాగవతం పుస్తకాలు అందజేశారు. గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు భౌమిక్ పరిమళ్, కవుల సంఘం వ్యవస్థాపకుడు రమేశ్, కవయిత్రి జ్యోతి, ఉపాధ్యాయులు దినేశ్, శ్రీనివాస్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

24 వరకు 'తపాలా మేళా'

కాగజ్‌నగర్‌టౌన్: ఈ నెల 24వ తేదీ వరకు తపాలా మేళా నిర్వహిస్తున్నట్లు కాగజ్‌నగర్ సబ్ డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సిరికొండ సతీశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఖాతాదారులు స్వయంగా ఇంటి నుంచి www.indiapost.gov.in ద్వారా తపాలా పొదుపు ఖాతాలు ప్రారంభించుకోవచ్చని తెలిపారు. మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకున్న పోస్ట్ ఇన్ఫో యాప్ ద్వారా తపాలా శాఖలో ఉన్న పథకాలు, వడ్డీ శాతం, పథకం ప్రయోజనాలు తదితర సమాచారాన్ని తెలుసుకోవచ్చని వివరించారు. ఆన్‌లైన్ ఖాతాలో ఏవైనా సందేహాలు ఉంటే ఉచిత 1800 2666868 నంబర్‌పై ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సంప్రదించవచ్చని సూచించారు.

లాభమా.. నష్టమా..?



జిల్లాలో ఓ జిన్నింగ్ మిల్లు (ఫైల్)

- అంచనాలకు అందని పత్తి వ్యాపారం
- ఆందోళనలో రైతులు, ట్రేడర్లు
- అనామతుగా జిన్నింగ్ మిల్లుల్లో విక్రయం
- 'ధర పెరిగితే పరిస్థితి ఎలా' అనే దానిపై అయోమయం

సాక్షి, ఆసిఫాబాద్: జిల్లాలో ఇటు పత్తి రైతులు, అటు జిన్నింగ్ మిల్లు యజమానులు అయోమయంలో పడ్డారు. ఈ ఏడాది మార్కెట్‌లో పత్తికి ఆశించిన ధర రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది పత్తి ధర క్వింటాకు రూ.10 వేలకు మించి పలికింది. దీంతో రైతులు ధర పెరిగే వరకు పంటను విక్రయించకుండా ఇళ్ల వద్దే నిలువ చేస్తున్నారు. పత్తి కొనుగోళ్లపైనే ఆధారపడి ఉన్న జిన్నింగ్ మిల్లులపై ఈ ప్రభావం పడింది. చాలా మంది రైతులు జిన్నింగ్ మిల్లుల్లో పత్తిని విక్రయిస్తున్నప్పటికీ డబ్బులు తీసుకోకుండా అనామతుగా(పట్టీలు తీసుకొని) ఇచ్చి వెళ్తున్నారు. భవిష్యత్తులో ధరలు రూ.9 వేల నుంచి రూ.10 వేల వరకు వెళ్తే అనామతుగా తీసుకున్న పత్తికి అప్పుడున్న ధర చెల్లించడం ద్వారా భారీగా నష్టపోతామని జిన్నింగ్ మిల్లు యజమానులు కలవరపడుతున్నారు. ప్రస్తుతం పత్తిని తీసుకుంటే లాభమా.. నష్టమా..? అన్న అంచనాలకు రాలేకపోతున్నారు.

ఆందోళనలో రైతులు..

చేతికి వచ్చిన పత్తి పంటను మార్కెట్‌లో అమ్ముకోలేక.. ఇంటి వద్ద నిల్వ ఉంచుకోలేక పత్తి రైతులు ఆందోళన చెందుతున్నారు. సీజన్ ప్రారంభంలో క్వింటాలు పత్తి రూ.9,200 పలికింది. పూర్తిస్థాయిలో పత్తి పంట చేతికి వచ్చిన నేపథ్యంలో క్రమేపీ పత్తి ధర తగ్గుతూ వచ్చింది. ఫలితంగా మద్దతు ధర రూ.15 వేలు చెల్లించాలని రైతుల హక్కు పోరాట సమితి ఆధ్వర్యంలో ఇటీవల జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున రైతులు నిరసనకు దిగారు. కొన్ని రోజులుగా జిన్నింగ్ మిల్లుల్లో పత్తి క్వింటాకు రూ.7,600 నుంచి రూ.8,000 వరకు ధర పలుకుతోంది. ధర మరింత పెరిగితే పత్తి పంటను విక్రయించాలని రైతులు ఆశపడుతున్నారు. ప్రస్తుతం ఉన్న ధరకే పత్తిని విక్రయిస్తే లాభాల్లో నష్టం చవిచూడాల్సి వస్తుందనే ఆందోళన సైతం వారిని వెంటాడుతోంది.

పెరిగిన సాగు

ఆసిఫాబాద్ జిల్లాలో ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో పత్తి సాగు చేశారు. ఈ జిల్లాలో 95 శాతం మెట్ట ప్రాంతం కావడంతో రైతులు పత్తినే ప్రధాన పంటగా ఎంచుకుంటున్నారు. గతేడాది 3.70 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేస్తే, ఈసారి 4 లక్షల ఎకరాలకు పెరిగినట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఆ శాఖ అధికారుల అంచనా ప్రకారం 21 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి రావాల్సి ఉంది. అధిక వర్షాల కారణంగా 15 లక్షల మెట్రిక్ టన్నులకు మించి పత్తి మార్కెట్‌కు వచ్చే అవకాశం లేదని వారు పేర్కొంటున్నారు. ప్రస్తుతం వారి గణాంకాల ప్రకారం వ్యవసాయ మార్కెట్లు, జిల్లాలో ఉన్న 18 జిన్నింగ్‌ల ద్వారా సుమారు రూ.6 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని రైతులు విక్రయించినట్లు తెలుస్తోంది.

అన్నీ అనామతు విక్రయాలే..

ధరలో భారీ వ్యత్యాసం ఉండడంతో 40 శాతం మంది పత్తి రైతులు పంటను విక్రయించకుండా ఇళ్ల వద్దే నిలువ చేసుకుంటుండగా.. 60 మంది రైతులు మాత్రం తమ పంటను అనామతు(డబ్బు పట్టీ) కింద జిన్నింగ్ మిల్లు యజమానులకు అప్పగించి వెళ్తుండడం గమనార్హం. 'డబ్బులు ఇస్తాం. తీసుకెళ్లండి..' అని కోరినా వారు అంగీకరించడం లేదని జిన్నింగ్ మిల్లుల యజమానులు చెబుతున్నారు. రోజురోజుకీ పత్తి ధరల్లో వ్యత్యాసం వస్తుండడంతో జిన్నింగ్ యజమానులకు ఎటూ పాలుపోవడం లేదు. అనామతుగా పత్తిని తీసుకోవాలా? వద్దా అన్న మీమాంసతో ఉన్నారు. ఇటీవల రూ.8 వేల వరకు వెళ్లిన ధర ఒక్కసారిగా రూ.300 తగ్గింది. ఒక్కో రోజు రూ.100 వరకూ పెరుగుతోంది. గతేడాది మాదిరిగా ఒకవేళ సీజన్ పూర్తయ్యాక పత్తి ధర పెరిగితే మాత్రం కొన్ని జిన్నింగ్ మిల్లులు మూతపడడం ఖాయమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

అన్న పనిచేస్తేనే.. చెల్లెళ్ల కడుపు నిండేది!

పసితనం.. అమాయక చూపులు.. నలుగురిలో ఒకరికి కూడా నిండా పద్దెనిమిదేళ్లు నిండని వయస్సు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన ఆ గిరిజన బిడ్డల ఆలనాపాలన చూసుకునే వారు కరువయ్యారు. ఏడాదిగా రేషన్ కూడా అందకపోవడంతో ఆకలి కడుపులతో కాలం వెళ్లదీస్తున్నారు. చదువుకునే స్తోమత లేక ఇద్దరు చదువులకు దూరం కాగా, మరో ఇద్దరు స్థానికంగా ఉన్న ప్రభుత్వ బడికి వెళ్తున్నారు.

- తల్లిదండ్రుల మరణంతో అనాథలైన ఆ నలుగురు
- ఏడాదిగా రేషన్ బియ్యం కూడా అందని వైనం..
- రోజువారీగా బియ్యం కొనుక్కుని గడుపుతున్న చిన్నారులు
- తమను ఆదుకోవాలని దీనంగా వేడుకుంటున్న పిల్లలు



తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన చిన్నారులు

దహెగాం(సిర్పూర్): దహెగాం మండలం చౌక గ్రామానికి చెందిన సిడాం సత్తయ్య, లలితకు ఐదుగురు సంతానం. ఆరేళ్ల క్రితం అనారోగ్యంతో సత్తయ్య మృతి చెందాడు. లలిత కూలీ పనులు చేసుకుంటూ ఐదుగురు పిల్లలను సాకుతూ వచ్చింది. రెండేళ్ల క్రితం పెద్ద కుమార్తెకు వివాహం చేసింది. విధి పగబట్టడంతో లలిత కూడా అనారోగ్యం బారిన పడి లోకాన్ని విడిచింది. మిగిలిన నలుగురు పిల్లలు దిక్కులేని వారయ్యారు. ప్రస్తుతం సిడాం రాజు(15) చెల్లెళ్లు మమత(13), దీపిక(10), దివ్య(7)లతో కలిసి ఉంటున్నాడు. రాజు కూలీ పనులకు వెళ్తుండగా మమత ఇంట్లోనే ఉంటూ తోబుట్టువులకు వంట చేసి పెడుతోంది. స్థానిక ప్రాథమిక పాఠశాలలో దీపిక ఐదో తరగతి చదువుతుండగా, దివ్య మూడో తరగతి చదువుతోంది. దివ్యకు మాటలు కూడా రావు. అన్న పనిచేస్తేనే ఆ చెల్లెళ్ల కడుపు నిండుతుంది. పని లేని రోజు పస్తులు ఉండాల్సిందే.

ఏడాదిగా రేషన్ కూడా బంద్

పూటపూటకు బియ్యం కొనుక్కోవాల్సిన ఈ గిరిజన బిడ్డలకు ఏడాదిగా రేషన్ కూడా అందడం లేదు. పిల్లల తల్లి లలిత మృతి చెందిన తర్వాత నుంచి రేషన్ బియ్యం సరఫరా నిలిచిపోయింది. రాజు పనులకు వెళ్తేనే కుటుంబం పూట గడుస్తుంది. ఒక్కో రోజు సరుకులకు డబ్బులు లేక చిన్న వయస్సులోనే పస్తులు ఉండాల్సిన పరిస్థితి. ఇరుగుపొరుగు వారు వీరి పరిస్థితిని చూసి బియ్యం ఇస్తే ఆ పూటకు అన్నం వండుకుంటున్నారు. ప్రభుత్వం, దాతలు స్పందించి తమను ఆదుకోవాలని గిరిజన బిడ్డలు కోరుతున్నారు.

కూలీకి వెళ్తేనే బుక్కెడు బువ్వ



పనికి పోయిన రోజు వచ్చిన పైసలతోనే బియ్యం తెచ్చుకుంటాం. ఆరోజే నాకు, చెల్లెళ్లకు బుక్కెడు బువ్వ దొరుకుతది. పని లేకపోతే ఉపాసం ఉండుడే. ఎవరైన బియ్యం ఇస్తే వండుకుంటాం. సంవత్సరం నుంచి రేషన్ కూడా వస్తలేదు. ఉన్న అరెకరం వేరే వాళ్లు సాగు చేసుకుంటున్నారు. పెద్దసార్లు మమ్మల్ని ఆదుకోవాలి.

– సిడాం రాజు

సేవాలాల్ చూపిన మార్గంలో నడవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే



ప్రేంసింగ్ మహరాజ్‌ను సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్లు, ఎమ్మెల్యే

- కలెక్టర్ హేమంత్ బోర్కడే
- జిల్లా కేంద్రంలో ఘనంగా జయంతి ఉత్సవాలు
- హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్లు కోవ లక్ష్మి, రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యే సక్కు

ఆసిఫాబాద్: సంత్ సేవాలాల్ చూపిన మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్ సమీపంలో ఏర్పాటు చేసిన సేవాలాల్ 284 జయంతి వేడుకల్లో కుమురంభీం, ఆదిలాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్లు కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి హాజరయ్యారు. బంజారా గురువు ప్రేంసింగ్ మహరాజ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ బోధనలు ఎన్ని యుగాలు గడిచినా ఆదర్శనీయమైనవని అన్నారు. వాటిని నిత్యజీవితంలో అమలు చేయాలన్నారు. 25 అంశాలను ఆదర్శంగా తీసుకుని జీవించిన వ్యక్తి అని కొనియాడారు. ఉత్సవాలకు మాత్రమే పరిమితం కాకుండా ప్రతిరోజూ ఆయనను స్మరించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన హోమంలో జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, కలెక్టర్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్, అదనపు కలెక్టర్ లంబాడా మహిళలతో కలిసి చేసిన నృత్యం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు గుగ్లోత్ రవినాయక్, కార్యదర్శి శివప్రసాద్, గౌరవ అధ్యక్షుడు రాథోడ్ శంకర్ నాయక్, ప్రతినిధులు బలరాం నాయక్, దూపానాయక్, ఇందులాల్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను ప్రారంభానికి సిద్ధం చేయాలి

- అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

ఆసిఫాబాద్‌రూరల్: మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో ఎంపికైన పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం మన ఊరు– మన బడి కార్యక్రమం పనుల్లో పురోగతిపై సంబంధిత శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మూత్రశాలలు, వంటశాలలు, ప్రహరీ నిర్మాణం, తాగునీటి, విద్యుత్ సౌకర్యం తదితర పనులు వేగంగా పూర్తిచేయాలన్నారు. పాఠశాల కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అలాగే ఉపాధిహామీ పథకం కింద ఎంపికైన సీసీ రోడ్డు నిర్మాణ పనులు గడువులోగా పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, డీపీవో రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దళిత బంధు యూనిట్లు సద్వినియోగం చేసుకోవాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): రాష్ట్ర ప్రభుత్వం దళిత బంధు పథకం ద్వారా మంజూరు చేసిన స్వయం ఉపాధి యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. మంగళవారం మండలంలోని పులికుంటలో దళిత బంధు ద్వారా మంజూరైన డెయిరీ ఫాంలను సందర్శించారు. డెయిరీ ఫాం ఏర్పాటుతో పొందుతున్న లబ్ధి, నిర్వహణ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ బుర్స పోషమల్లు, లబ్ధిదారులు ఉన్నారు.

రోడ్డెక్కాలంటేనే వణుకు..!

గ్రామాల్లో వీధి కుక్కలు, కోతులు గుంపులుగా తిరుగుతూ వీరంగం సృష్టిస్తున్నాయి. ఇష్టారీతిన దాడులకు తెగబడుతూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఒంటరిగా రోడ్డెక్కాలంటేనే పిల్లలతోపాటు పెద్దలు వణుకుతున్నారు. నిజామాబాద్ జిల్లాకు చెందిన ఐదేళ్ల బాలుడిపై ఆదివారం హైదరాబాద్‌లో వీధి కుక్కలు దాడి చేసి ప్రాణాలు తీశాయి. ఈ ఘటన వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. రెండేళ్ల క్రితం చింతలమానెపల్లి మండలం బాబాసాగర్‌లో కూడా ఇలాగే ఓ బాలుడిపై వీధి కుక్కలు దాడి చేసి చంపేశాయి.

- గుంపులుగా తిరుగుతున్న కుక్కలు, కోతులు
- వరుస దాడులతో జంకుతున్న జనం
- జిల్లాలోనూ హైదరాబాద్ తరహా ఘటనలు
- శునకాల సంతతి నియంత్రణపై దృష్టి సారించని అధికారులు



కౌటాలలో గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు

కౌటాల(సిర్పూర్): జిల్లాలో కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గ్రామాల్లో నిత్యం ఏదో ఒక చోట శునకలు జనంపై దాడులకు దిగుతున్నాయి. పగలు కోతుల గుంపులు భయపెడుతుండగా.. రాత్రివేళ రోడ్డెక్కితే కుక్కలు హడలెత్తిస్తున్నాయి. జనాభా నియంత్రణకు చర్యలు చేపట్టకపోవడంతో పల్లెల్లో వీటి సంఖ్య గణనీయంగా పెరిగింది.

కోతులు.. శునకాలు

పల్లెల్లో గుంపులుగా తిరుగుతున్న కోతులు ఏ మాత్రం ఏమరపాటుగా ఉన్న ఇళ్లలోకి దూరుతున్నాయి. పెరట్లోని కూరగాయలు, పండ్లు నాశనం చేస్తున్నాయి. దొరికిన వస్తువులను ఎత్తుకెళ్తున్నాయి. ఇదే తీరుగా హోటళ్లు, చికెన్ షాపులు, ఫంక్షన్ హాళ్ల వద్ద వ్యర్థాలు తింటూ శునకాలు స్వైరవిహారం చేస్తున్నాయి. చిన్నారులు, వృద్ధులను చుట్టుముట్టి గాయపరుస్తున్నాయి. ఇళ్లలో పెంచుతున్న పెంపుడు కుక్కలకు కూడా టీకాలు వేయించకపోవడంతో కుక్క కాట్లు ప్రాణాంతకంగా మారుతున్నాయి. నాలుగైదేళ్లుగా జిల్లాలో అసలు కుక్కలకు కు.ని. శస్త్రచికిత్సలు కూడా నిర్వహించలేదు. ఫలితంగా వాటి సంతతి పెరుగుదలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. పీహెచ్‌సీల్లో బాధితులకు వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నా తీవ్రమైన గాయాలయితే మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేస్తున్నారు.

నియంత్రణ చర్యలు శూన్యం..

వీధి కుక్కల నియంత్రణ బాధ్యత పూర్తిగా స్థానిక సంస్థలదే. అయితే సిబ్బంది కొరత, నిధుల లేమి ఇతర కారణాలతో పట్టించుకునే వారు కరువయ్యారు. కోతుల సంతతిని నియంత్రించేందుకు రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా నిర్మల్ జిల్లా కేంద్రం శివారులో వానర సంరక్షణ, పునరావాస కేంద్రాన్ని 2020 డిసెంబర్‌లో ప్రారంభించారు. ఇప్పటివరకు కుమురం భీం జిల్లా నుంచి కోతులను పట్టుకుని ఈ సంరక్షణ కేంద్రానికి తరలించిన దాఖలాలు లేవు. నియంత్రణ చర్యలు చేపట్టడంలో జిల్లా అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ప్రజలు మండిపడుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

కోతులు, కుక్కల సంతతిని నియంత్రించాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీలదే. సిబ్బంది కొరత, నిధుల లేమితో నియంత్రణ చర్యలు తీసుకోవడం లేదు. రోడ్డు పక్కన వ్యర్థాలను పడేయొద్దు. కుక్కల నియంత్రణకు ప్రత్యామ్నాయ ఆలోచనలు చేసి, తగిన చర్యలు తీసుకుంటాం.

– రమేశ్, జిల్లా పంచాయతీ అధికారి

జిల్లాలో జరిగిన ఘటనలు

- గత డిసెంబర్ 31న జిల్లా కేంద్రంలోని పైకాజీనగర్‌లో నలుగురిపై పిచ్చికుక్కలు దాడి చేసి గాయపర్చాయి. బ్రాహ్మణవాడ, రావులవాడ, తేలివాడ, పాట్టి శ్రీరాములుచౌక్, పైకాజీనగర్ కాలనీల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉందని కాలనీవాసులు వాపోతున్నారు.
- చింతలమానెపల్లి మండలం డబ్బా గ్రామ పంచాయతీ పరిధిలోని బారెగూడలో జనవరి 30న గుర్లె కుమారస్వామి, బోర్లె విఘ్నేష్ ఇంటి ఆవరణంలో ఆడుకుంటుండగా చిన్నారులపై పిచ్చికుక్క దాడి చేసి గాయపరిచింది. ఈ ఘటనలో కుమారస్వామికి తీవ్ర గాయాలు కావడంతో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.
- ఈ నెల 4న కాగజ్‌నగర్ పట్టణంలోని బస్టాండ్ ఏరియాలో, రిక్షా కాలనీల్లో 21 మందిపై పిచ్చికుక్కలు దాడి చేశాయి. పలువురి మహిళలతో పాటు యువకులు గాయపడ్డారు.
- ఈ నెల 6న బెజ్జూర్ మండలం ఎలుకపెల్లి గ్రామానికి చెందిన అరుణ్ అనే బాలుడు రోడ్డుపై ఆడుకుంటున్న సమయంలో ఒక్కసారిగా పిచ్చికుక్కలు దాడి చేసి గాయపర్చాయి.
- ఈ నెల 8న కౌటాల మండల కేంద్రానికి చెందిన యువకుడిపై కోతులు దాడి చేసి గాయపర్చడంతో స్థానిక పీహెచ్‌సీలో చికిత్స చేయించారు.

సేంద్రియ పంటలతో మేలు

- ఎమ్మెల్యే కోనప్ప



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనప్ప

కౌటాల(సిర్పూర్): సేంద్రియ ఎరువులతో పంటల సాగుతో రైతులతోపాటు ప్రజలు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. కౌటాల మండలం విజయనగరం గ్రామానికి చెందిన యువ దంపతులు మదాసు రవి, సునంద సీవీఆర్ పద్ధతిలో సాగు చేస్తున్న పంటలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రకృతిసిద్ధంగా పండించిన ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పంటలు తీసుకోవడం ద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. యువ రైతు దంపతులను ఆదర్శంగా తీసుకుని, సహజ పద్ధతిలో పంటలు సాగు చేయాలని సూచించారు. రైతుల పంట పొలాలకు మెరుగైన రోడ్డు వసతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్, కౌటాల సర్పంచ్ వొజ్జల మౌనిక్, కోఆప్షన్ సభ్యుడు అజ్మత్, నాయకులు రవీందర్‌గౌడ్, మధుకర్, శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆదర్శ క్రీడాపాఠశాలలో ప్రవేశాలకు ఎంపిక పోటీలు

పాతమంచిర్యాల: గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో ప్రవేశాల కోసం హైదరాబాద్‌లోని బోయినపల్లిలోగల వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి వీ నీలిమ, జిల్లా గిరిజన క్రీడల అధికారి జీవరత్నం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న మంచిర్యాలలోని ప్రభుత్వ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న గిరిజన బాలబాలికలు ప్రవేశాలకు అర్హులని తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థిని, విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఆదర్శ క్రీడాపాఠశాల, ఆదర్శ క్రీడా పాఠశాల కేబీ కాంప్లెక్స్ ఉట్నూర్, బాలికల ఆదర్శ క్రీడా పాఠశాల ఆసిఫాబాద్, వాటర్ స్పోర్ట్స్ అకాడమీ బోయినపల్లిలో ప్రవేశాలు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు ఆధార్ కార్డు, బోనఫైడ్ సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఎలిజిబిలిటీ ఫామ్‌తో సంప్రదించాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన బాలబాలికలు ఐటీడీఏ ఉట్నూర్, వాటర్ స్పోర్ట్స్ అకాడమీ హైదరాబాద్‌లో పాల్గొనాల్సి ఉంటుందని వివరించారు.

గుడుంబా విక్రేతకు జైలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రొహిబిషన్, ఎక్సైజ్‌స్టేషన్ పరిధిలో నాటుసారా విక్రయిస్తూ రెండోసారి పట్టుబడిన నిందితుడికి జైలుశిక్ష పడింది. బెల్లంపల్లి ఎక్సైజ్ సీఐ డీ దీపక్ తెలిపిన వివరాల ప్రకారం.. మందమర్రి మండలం రామకృష్ణాపూర్ పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్ చెందిన మిట్టపల్లి రాజలింగు గతంలో ఓసారి నాటుసారా విక్రయిస్తూ బెల్లంపల్లి ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డాడు. అతడిని మందమర్రి తహసీల్దార్ సంపత్ శ్రీనివాస్ ఎదుట అప్పట్లో ఎక్సైజ్ పోలీసులు బైండోవర్ చేశారు. అతడిలో మార్పు రాకపోగా రెండోసారి కూడా ఇటీవల నాటుసారా విక్రయిస్తూ ఎక్సైజ్ పోలీసులకు చిక్కాడు. వెంటనే అతడిని తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట హాజరుపర్చారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించినందుకు రూ.లక్ష జరిమానా చెల్లించాలని తహసీల్దార్ ఆదేశించారు. నిందితుడు జరిమానా చెల్లించడానికి నిరాకరించగా అతడిని ఆదిలాబాద్ జిల్లా జైలుకు రిమాండ్ చేస్తూ తహసీల్దార్ ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం రాజలింగును అదుపులోకి తీసుకుని జైలుకు పంపించినట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

బీపీఏలో జీఎం ఐఅండ్‌పీఎం పర్యటన



రవికుమార్‌ను సన్మానిస్తున్న దేవేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో మంగళవారం జీఎం (ఐఅండ్‌పీఎం) కార్పొరేట్ ఏ రవికుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్‌తో పాటు ఇతర విభాగాల అధికారులు జీఎం రవికుమార్‌కు స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం ఏరియాలో కొత్తగా ప్రారంభించబోయే గోలేటి ఓసీపీతో పాటు ఎంవీకే ఓసీపీల పురోగతిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కొత్త గనుల ఏర్పాటు పనులను మరింత వేగవంతం చేయాలని, సాధ్యమైనంత త్వరగా కొత్త ఓసీపీల్లో ఉత్పత్తి ప్రక్రియను ప్రారంభించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. కొత్త గనుల ఏర్పాటుకు అవసరమైన అనుమతులు, సర్వే పనులు, భూసేకరణ లాంటి అనేక అంశాలపై ఏరియా అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఎస్వోటూ జీఎం గుప్తా, ఏరియా ఇంజినీర్ తిరుమలరావు, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

లాభాలు పట్టు

- దసలిపట్టు సాగుపై రైతుల ఆసక్తి
- మంచిర్యాల, కుమురంభీం జిల్లాల్లోని ఏడు మండలాలు, 16 గిరిజన గ్రామాల్లో..
- 860 ఎకరాల్లో సాగు చేస్తున్న రైతులు
- రికార్డు స్థాయిలో ధర పలికిన కాయ
- వేలానికి వివిధ రాష్ట్రాల వ్యాపారులు
- మూడేళ్లలో భారీగా పెరిగిన ఉత్పత్తి

రెండు జిల్లాల్లో సాగు ఇలా..

మంచిర్యాలలో..	
సాగు విస్తీర్ణం	600ఎకరాలు
పట్టుకాయల లక్ష్యం	22 లక్షలు
ఈ ఏడాది దిగుబడి	12 లక్షలు
కుమురంభీం జిల్లాలో..	
సాగు విస్తీర్ణం	260ఎకరాలు
పట్టుకాయల లక్ష్యం	4 లక్షలు
రెండు జిల్లాల్లో ఉత్పత్తి ఇలా..	
2020లో	4 లక్షలు
2021లో	12 లక్షలు
2022లో	38 లక్షలు



చెన్నూర్‌లోని దసలిపట్టు పరిశ్రమ కేంద్రంలో వేలంలో వివిధ రాష్ట్రాల వ్యాపారులు (ఫైల్)

చెన్నూర్: అడవుల్లో ప్రకృతి సిద్ధంగా లభించేనల్లమద్ది చెట్లు పెంచే దసలి పట్టుపురుగులతో గిరిజన రైతులకు జీవనోపాధి లభిస్తోంది. గుంట భూమి లేనివారికి కూడా ఈ సాగు లాభదాయకంగా మారింది. ప్రభుత్వం అందించే సబ్సిడీతో పట్టు కాయలు ఉత్పత్తి చేసి ఆదాయ మార్గాలను సుగమం చేసుకుంటున్నారు. గత 20 ఏళ్లలో ఏనాడు లేనివిధంగా ఈసారి రికార్డు స్థాయిలో పంట పండించి లాభాలు ఆర్జించారు.

చెన్నూర్‌లో దేశవ్యాప్త పట్టుకాయ వేలం

గతేడాది ఇతర రాష్ట్రాల్లో పట్టుకాయ దిగుబడి లేకపోవడంతో చెన్నూర్ పట్టు పరిశ్రమ ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. మహారాష్ట్ర, వెస్ట్‌బెంగాల్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు చెన్నూర్‌కు వచ్చారు. దసలి కాయలను వేలం ద్వారా కొనుగోలు చేశారు.

దేశంలో తొమ్మిది రాష్ట్రాల్లో..

దేశంలోని తొమ్మిది రాష్ట్రాల్లో దసలి పట్టు పంట పండిస్తున్నారు. ఇందులో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నాణ్యమైన పట్టుగూళ్లను ఛత్తీస్‌గఢ్, ఒరిస్సా, జార్ఖండ్ రాష్ట్రాల్లో పండిస్తున్నారు. మూడేళ్లుగా తెలంగాణలోని మంచిర్యాల జిల్లాలో నాణ్యమైన దసలి పట్టుకాయలు పండిస్తున్నారు. సంప్రదాయంగా పట్టు పండించే రాష్ట్రాలతో మంచిర్యాల జిల్లా పోటీ పడుతోంది. గతేడాది ప్రతికూల వాతావరణం కారణంగా దేశ వ్యాప్తంగా దసలి పంట పండలేదు. ఒక్క తెలంగాణలోని మంచిర్యాల జిల్లా చెన్నూర్ ప్రాంతంలోనే పంట దిగుబడి రావడం విశేషం. ఈ ఏడాది పట్టు కాయ ధర రికార్డు స్థాయిలో పెరిగింది. వెయ్యి కాయలకు రూ.3,810 ధర పలికింది. రానున్న పంటకు రూ.4వేలు పలికే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

గిరిజనాభివృద్ధి అధికారి పర్యటన

సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ అధికారి కర్నాటి వరుణ్‌రెడ్డి దసలి పంట సాగును పరిశీలించేందుకు రెండునెలల క్రితం కోటపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో పర్యటించారు. పట్టుకాయ సాగు వివరాలు రైతులను అడిగి తెలుసుకున్నారు. సబ్సిడీ డబ్బుల పెండింగ్‌లో ఉన్నాయని రైతులు పీవోకు తెలుపగా 50 శాతం సబ్సిడీ మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. నెలలోనే రూ.7.40 లక్షల సబ్సిడీ డబ్బులు విడుదల చేయించారు.

కాయలకు మంచి డిమాండ్ ఉంది

దేశంలోనే మంచిర్యాల పట్టుకాయలకు మంచి డిమాండ్ ఉంది. ఎలాంటి వ్యవసాయ భూమి లేని గిరిజన రైతులకు దసలి పట్టు సాగు వరంలా మారింది. పెట్టుబడి లేకుండా పండించే పంట దసలి పట్టు. ఈ ఏడాది ధర పెరగడంతో ఒక్కో రైతుకు రూ.60వేల నుంచి రూ.70వేల ఆదాయం వచ్చింది. ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన శిక్షణ ఇస్తూ పంటలను పరిశీలించి సలహాలు, సూచనలు ఇవ్వడంతోనే ఇది సాధ్యమైంది. రానున్న రోజుల్లో దిగుబడి పెంపునకు కృషి చేస్తాం.

– రాథోడ్ పార్వతి, సెరికల్చర్ ఏడీ, చెన్నూర్

లైన్‌మన్ పరీక్షకు ఉచిత శిక్షణ

శ్రీరాంపూర్: రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్‌శాఖలో చేపట్టిన లైన్‌మన్ ఉద్యోగాల భర్తీలో భాగంగా నిర్వహించే పరీక్షకు అవసరమైన శిక్షణను జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఉచితంగా ఇవ్వనున్నట్లు జేసీఐ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఆరుమల్లు రాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ తరగతులకు హాజరయ్యేవారు ఆధార్‌కార్డు, బయోడేటా జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో డీటీవో వెంకటేశ్వర్లును 8179085222, 9985512134 నంబర్లలో సంప్రదించాలని కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.చందర్ సూచించారు.

సింగరేణి ఉద్యోగుల సమస్యలపై పట్టింపేది?



కేకే ఓసీపై మాట్లాడుతున్న నాగరాజ్‌గోపాల్

మందమర్రిరూరల్: సింగరేణి ఉద్యోగుల హక్కుల సాధన, సౌకర్యాల కల్పన విషయంలో యాజమాన్యం, గుర్తింపు సంఘాలకు పట్టింపులేదని సీఐటీయూ డిప్యూటీ జనరల్ సెక్రటరీ నాగరాజ్‌గోపాల్ ఆరోపించారు. మంగళవారం మందమర్రి ఏరియాలోని కేకే ఓసీ వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేకే ఓసీ ఏర్పాటు కాకముందు భూగర్భగని ఉండేదని, అప్పుడు ఆ గనిలో పనిచేసే క్వార్టర్ లేని ఉద్యోగులకు ఇంటికిరాయి చెల్లించేవారని తెలిపారు. ఓసీ ఏర్పాటైన తర్వాత ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. సింగరేణిలోని క్వార్టర్లను కార్మికులకు సొంతింటి కింద ఇవ్వాలని కోరారు. ఎప్పటికప్పుడు సీఎంపీఎఫ్ చిట్టీలు అందించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలపై ఎందుకు స్పందించడం లేదని గుర్తింపు ప్రాతినిథ్య సంఘాల నాయకులను ప్రశ్నించారు. ఉద్యోగులను ఏకం చేసి హక్కులసాధన, సౌకర్యాల కల్పనకు సీఐటీయూ పోరాడుతుందన్నారు. నాయకులు ఆరీఫ్, రాజేందర్, వెంకటస్వామి, సంజీవ్ ఉన్నారు.

జీఎం కార్యాలయం ఎదుట బీఎంఎస్ ధర్నా



ధర్నా చేస్తున్న బీఎంఎస్ నాయకులు

శ్రీరాంపూర్: గని కార్మికుల 11వ వేతన ఒప్పందంలో అలవెన్సులు, ఇతర డిమాండ్లపై బీఎంఎస్ ఆధ్వర్యంలో మంగళవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు పెండ్లి మోహన్‌రెడ్డి మాట్లాడారు. గని కార్మికుల పూర్తి వేతన ఒప్పందంలో ఇంకా అలవెన్సుల పెంపు, సెలవు, ఇతర రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఇతర ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించిన ఒప్పందం జరగాల్సి ఉందని తెలిపారు. దీన్ని త్వరగా చేయాలని కోలిండియాను డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టినట్లు తెలిపారు. ఇటీవల 19 శాతం మినిమం గ్యారెంటీ బెనిఫిట్‌పై ఒప్పందం జరగడం కూడా తమ యూనియన్ వేజ్‌బోర్డు సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి కృషి ఫలితమేనని పేర్కొన్నారు. ఆయన కేంద్రం, కోలిండియా యాజమాన్యంపై ఒత్తిడి తేవడంతోనే ఈ ఒప్పందం జరిగిందని తెలిపారు. మిగిలిన డిమాండ్లపై కూడా మెరుగైన ఒప్పందం చేయడం కోసం బీఎంఎస్ పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం ఏరియా ఎస్వోటూ జీఎం త్యాగరాజును కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి, నాయకులు కాదాసి భీమయ్య, జీడీ ప్రభాకర్, పంచెర్పుల నరేశ్, మేకల స్వామి, గోపతి సందీప్, కాంపెల్లి తిరుపతి, బైసగోని కుమారస్వామి పాల్గొన్నారు.

రేషన్‌బియ్యం కోసం ఎదురుచూపులు



రేషన్‌షాపు వద్ద వేచి చూస్తున్న లబ్ధిదారులు

భీమారం: మండలంలోని దాంపూర్ గ్రామంలో ఇప్పటివరకు ఫిబ్రవరికి సంబంధించిన రేషన్ బియ్యం అందించలేదని గ్రామస్తులు ఆరోపించారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. రేషన్‌డీలర్‌పై గత నెలలో 6ఏ కేసు నమోదు కాగా అతడి స్థానంలో కాజిపల్లి డీలర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారని తెలిపారు. జనవరిలో లబ్ధిదారులందరికీ 34 క్వింటాళ్ల బియ్యం అందించాల్సి ఉండగా 16 క్వింటాళ్లే ప్రభుత్వం సరఫరా చేసిందని డీలర్ తెలిపాడని పేర్కొన్నారు. ఈనెల 21వరకూ ఫిబ్రవరి కోటా రాలేదని చెబుతున్నాడని వాపోయారు. అధికారుల దృష్టికి తీసికెళ్లినా పట్టించుకోవడంలేదని తెలిపారు. ప్రభుత్వం నెలనెలా బియ్యం సరఫరా చేస్తున్నా అధికారులు, డీలర్ నిర్వాకంతో తమకు అందడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు సక్రమంగా రేషన్ బియ్యం అందించాలని వారు కోరుతున్నారు.

పాత పద్ధతిలోనే పనివేళలు కొనసాగించాలి



మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో ఓబీ కాంట్రాక్టర్లకు అనుకూలంగా మార్చిన ఓవర్‌మెన్ల పనివేళలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కైరిగూడ ఓసీపీ మేనేజర్ ప్రవీణ్ ఫటింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకప్పుడు బెల్లంపల్లి ఏరియాలో ఉత్పత్తిలో అన్ని ఏరియాల కంటే ముందువరుసలో ఉండేదని, కానీ యాజమాన్యం లోపంతో నేడు వెనుకబడిందని తెలిపారు. యాజమాన్యం లోపం కారణంగా ప్రభుత్వ అనుమతులు రాక కొత్త గనులు ఏర్పాటు కావడం లేదని పేర్కొన్నారు. పదేళ్లుగా బెల్లంపల్లి ఏరియాలోని ఓసీపీల్లో కార్మికులు సాధారణ పనివేళల్లో పని చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఓబీ కాంట్రాక్టర్ల కోసం అన్‌లోడింగ్ పేరుతో కాంట్రాక్టర్లకు అనుకూలంగా ఓవర్‌మెన్ల పనివేళలు మారుస్తూ మెమో జారీ చేసిందన్నారు. పారిశ్రామిక వివాదాల చట్టం 1977 సెక్షన్ 9ఏ ప్రకారం పనివేళల్లో మార్పు చెల్లదని, ఇప్పటికైనా పాత పద్ధతిలోనే ఓవర్‌మెన్ల పనివేళలు కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిట్ కార్యదర్శి రమేశ్, సెంట్రల్ కమిటీ నాయకుడు రవీందర్, ఓవర్‌మెన్లు సాగర్, రమేశ్ పాల్గొన్నారు.

మూడు వాహనాల సీజ్



సీజ్ చేసిన వాహనంతో అధికారులు

బెజ్జూర్: రోడ్ టాక్స్ చెల్లించని, వాహనపత్రాలు సరిగా లేని మూడు వాహనాలు మంగళవారం సీజ్ చేసినట్లు ఆర్టీవో రవీందర్ తెలిపారు. జిల్లా కేంద్రం నుంచి ప్రధాన రహదారి గుండా వెళ్తున్న వాహనాలను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నిబంధనలు పాటించని మండల కేంద్రంతోపాటు మర్తిడి, సలగుపల్లి గ్రామానికి చెందిన ముగ్గురి నుంచి మూడు వాహనాలు సీజ్ చేసి ఠాణాకు తరలించినట్లు తెలిపారు. ఆయన వెంట ఎంవీఐ రాజమల్లు ఉన్నారు.

త్వరగా వస్తానని తిరిగిరాని లోకాలకు..

- ఆటో బోల్తాపడి డ్రైవర్ మృతి



గట్టయి మృతదేహం వద్ద రోధిస్తున్న కూతురు, భార్య



గట్టయ్య (ఫైల్)

భీమిని: 'డాడీ లే డాడీ.. నాకు ఎగ్జామ్ ఉంది.. కాలేజీ దగ్గర దించేవు లే డాడీ..' అని కూతురు.. 'ఓ అయ్యా లే అయ్యా.. భాగ్యనగర్ ట్రెన్ టైమ్‌కు లేపకున్నా బతికేటోడివి.. నేను ఎందుకు లేపినా దేవుడా.. నువ్వు లేకుండా మేము బతికేదెట్లయ్యా..' అంటూ భార్య రోధించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి హన్మాన్‌బస్తీకి చెందిన పొట్ట గట్టయ్య (46) మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ లేబర్‌గా పని చేస్తూనే ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి భార్య వరలక్ష్మి, కూతురు శృతి ఉన్నారు. మంగళవారం ఉదయం భాగ్యనగర్ ట్రెన్ వచ్చే సమయానికి లేపమని భార్యకు చెప్పాడు. దీంతో వరలక్ష్మి 3.30 గంటలకు గట్టయ్యను లేపింది. అతడు ఆటోతో రైల్వేస్టేషన్‌కు వెళ్లాడు. ప్రయాణికులతో కన్నెపల్లికి వెళ్లి తిరిగి బెల్లంపల్లి వైపునకు ఒక్కడే వస్తున్నాడు. ఈక్రమంలో పోలంపల్లి వద్ద ప్రమాదవశాత్తు ప్రధాన రహదారి కిందికి ఆటో దూసుకెళ్లి పల్టీలు కొట్టింది. ఆటోలో ఉన్న గట్టయ్య కొంతదూరంలో ఎగిరిపడ్డడాడు. పత్తి చేన్లకు వెళ్లే పోలంపల్లి గ్రామస్తులు గమనించి 108తోపాటు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని అప్పటికే గట్టయ్య మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇంతలో అక్కడకు చేరుకున్న అతడి భార్య వరలక్ష్మి, కూతురు శృతి గట్టయ్య మృతదేహంపై పడి రోధించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. ఘటనా స్థలాన్ని తాండూర్ ఎస్సై సమ్మయ్య, కన్నెపల్లి ఏఎస్సై వెంకన్న పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కాంట్రాక్ట్ కార్మిక సమస్యలపై సీఎల్‌సీ సమక్షంలో ఒప్పందం



హైదరాబాద్‌లో సీఎల్‌సీ సమక్షంలో ఎస్టీపీపీ అధికారులు, కార్మిక సంఘం నాయకులు

జైపూర్: మండల కేంద్రంలోని 1200 మెగావాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో పని చేస్తున్న 1,450 మంది కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీఎంఎస్ అనుబంధ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్, ప్రొటెక్షన్ యూనియన్ ఆధ్వర్యంలో 17డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసులను గతేడాది మే 14న అందించిన విషయం తెలిసిందే. విడతల వారీగా కార్మిక సమస్యల పరిష్కారానికి హైదరాబాద్‌లో డిప్యూటీ సెంట్రల్ లేబర్ కమిషనర్ శ్రీనివాసులు సమక్షంలో ఎస్టీపీపీ మేనేజ్మెంట్, పవర్‌మేక్ కంపెనీ యాజమాన్యం, బీఎంఎస్ అనుబంధ సంఘం కార్మికనాయకులతో చర్చలు జరిపింది. మూడు దఫాలుగా హైదరాబాద్‌లో చర్చలు జరపగా పూర్తిస్థాయిలో సఫలీకృతం కాకపోగా నాలుగోవిడతగా మంగళవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సెంట్రల్ లేబర్ కమిషనర్ కార్యాలయంలో కార్మిక సంఘం నాయకులు, ఎస్టీపీపీ మేనేజ్మెంట్, పవర్‌మేక్ అధికారులతో చర్చలు జరిపారు. 17డిమాండ్లలో పదింటిని ఒప్పుకోగా మూడింటిని యాజమాన్యానికి సిఫారసు చేశారు. యాజమాన్యం కాంట్రాక్టర్ ఇచ్చిన కాంట్రాక్టర్ అవార్డులో రెండు అంశాలు లేనందున వాటిని పరిగణనలోకి తీసుకోకపోగా చివరగా మేనేజ్మెంట్ పీఎంపీఎల్ కాంట్రాక్టర్‌కు బీఎంఎస్‌కు మధ్య పలు అంశాలపై ఒప్పందం జరిగింది. ఫ్యాక్టరీలో పని చేస్తున్న హైక్వాలిఫైడ్ ఉద్యోగులకు ఆపరేషన్ మెయింటెనెన్స్‌లో ఉద్యోగం కల్పించడానికి, ఫ్యాక్టరీలో ఐదేళ్లుగా పని చేస్తున్న ప్రతీ కార్మికుడికి ఇంటర్వ్యూ పద్ధతి ద్వారా ప్రమోషన్లతో పాటు కార్మిక నాయకులు ప్రతిపాదించిన డిమాండ్లపై ఒప్పందం జరిగింది. కార్యక్రమంలో బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పేరం రమేశ్, ప్రెసిడెంట్ చినూరి రాజేందర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ దుస్స భాస్కర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ బోడకుంట శ్రీధర్, వైస్‌ప్రెసిడెంట్ చిలకాని వెంకటేశ్, రామగిరి మల్లేశ్, సురేందర్, రాజ్‌కుమార్ ఉన్నారు.

ట్రాక్టర్ దుర్వినియోగంపై విచారణ

తాండూర్: రేచినీ పంచాయతీకి చెందిన ట్రాక్టర్‌ను అధికార పార్టీ నేత సొంతానికి వాడుకున్న అంశంపై డీపీవో ఫణీందర్‌రావు మంగళవారం జీపీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఇటీవల పంచాయతీ కార్యదర్శి విండో చైర్మన్ సుబ్బా దత్తుమూర్తి వ్యవసాయ క్షేత్రంలోకి పంచాయతీ ట్రాక్టర్‌ను పంపించి కార్మికులతో పనులు చేయించినట్లు రేచినీ గ్రామస్తులు ఆరోపించారు. కొందరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈమేరకు స్పందించిన డీపీవో విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి, కార్మికులు, గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. నివేదికను కలెక్టర్‌కు అందిస్తానని డీపీవో తెలిపారు. ఆయన వెంట ఎంపీవో సత్యనారాయణ, సర్పంచ్ దుర్గబాయి ఉన్నారు.

పట్టపగలే రెండిళ్లలో చోరీ



కోర్టు సమీపంలోని ఇంటిలో దొంగలు పగులగొట్టిన బీరువా

లక్సెట్టిపేట: పట్టణంలో తాళం వేసి ఉన్న రెండిళ్లలో మంగళవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కోర్టు వెనుక వీధిలో ఉంటున్న శ్రీనివాస్ ఇంటికి తాళం వేసి షాప్‌నకు వెళ్లాడు. అతడి భార్య బంధువుల పెళ్లికి వెళ్లింది. ఇదే అదనుగా భావించిన దొంగలు ఇంటి వెనుక వైపు నుంచి లోపలికి చొరబడ్డారు. బీరువా తాళం పగులగొట్టి అందులోని రూ.46వేల నగదు ఎత్తుకెళ్లారు. అలాగే గోదావరి రోడ్‌లో ఉంటున్న ముజ్జు అనే బ్యాంక్ ఉద్యోగి డ్యూటీకి వెళ్లాడు. అతడి భార్య బంధువుల ఇంటికి వెళ్లింది. దీంతో దొంగలు తలుపులు పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. బీరువాలోని రూ.11వేల నగదు, తులం బంగారు గొలుసు, 13 తులాల వెండి గొలుసులు ఎత్తుకెళ్లారు. స్థానిక సెకండ్ ఎస్సై ప్రసాద్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

ఉబికి వస్తున్న పాతాళగంగ

- మోటారు లేకుండా ఉబికివస్తున్న నీరు
- వన్యప్రాణుల దప్పిక తీరుస్తున్న బోరు



ఇటిక్యాల పహాడ్ అటవీప్రాంతంలోని బోరు నుంచి ఉబికి వస్తున్న నీరు



ఇటిక్యాల పహాడ్ అటవీ ప్రాంతంలో బోరునీటితో నిండిన కుంట

సిర్పూర్(టి): వేసవిలో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు సిర్పూర్(టీ) రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతాల్లో అటవీశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇటిక్యాల పహాడ్ అటవీప్రాంతంలో నీటి వసతికి ఏర్పాటు చేసిన బోరు వేసవిలోనూ మోటారు లేకుండానే నీరు ఉబికివస్తోంది. దీంతో అటవీశాఖ అధికారులు, ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. బోరులోంచి నీరు 24 గంటలు వస్తుండగా రానున్న వేసవిలోనూ సమస్య తలెత్తదని అటవీశాఖ అధికారులు భావిస్తున్నారు. బోరు వేసిన అనంతరం ఎలాంటి మోటారు బిగించకుండానే దాని నుంచి నీరు పాతాళగంగలా 24గంటలు పారుతోంది. దీంతో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు బోరుతో పాటు పక్కనే నీరు నిల్వ ఉండడానికి కుంట ఏర్పాటు చేయించారు. బోరు నుంచి ఉబికి వస్తున్న నీరు కుంటలోకి వెళ్లేలా ఏర్పాటు చేశారు. ఎలాంటి మోటారు సహాయం లేకుండానే బోరు నుంచి ఉబికి వస్తున్న నీటితో పక్కనే ఉన్న నీటి కుంట నిండుతోంది. బోరుకు మోటారు ఏర్పాటు చేసి సోలార్ విద్యుత్ సాయంతో ఆటోమేటిక్ మోటారు నడిచేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు అటవీశాఖ అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. వేసవిలో సిర్పూర్(టీ) రేంజ్ పరిధిలోని అటవీప్రాంతాల్లో వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు పూర్తి స్థాయిలో నీటి వసతితో పాటు వన్యప్రాణుల ఆవాసాలుగా ఏర్పరుచుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు అటవీశాఖ అధికారులు వివరించారు.